క్లుప్తంగా

బుచ్చెయ్యపేట ఎస్‌ఐగా శ్రీనివాసరావు



బుచ్చెయ్యపేట : బుచ్చెయ్యపేట ఎస్‌ఐగా జి.శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా జీ మాడుగుల ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న ఆయనను బుచ్చెయ్యపేట స్టేషన్‌కు బదిలీ చేశారు. ఇక్కడ ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న డి.ఈశ్వరరావును అనకాపల్లి పట్టణ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. మంగళవారం విధుల్లో చేరిన కొత్త ఎస్‌ఐను స్టేషన్ సిబ్బంది స్వాగతించి అభినందించారు.

ఎస్‌ఐని సత్కరించిన సీడీసీ చైర్మన్



ఎస్‌ఐని దుశ్శాలువాలతో సత్కరిస్తున్న శ్రీను

చీడికాడ : చీడికాడ నూతన ఎస్‌ఐగా విధులు చేపట్టిన బి.సతీష్‌ను, సీడీసీ చైర్మన్ సుంకర శ్రీను మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసారు. ఆయనను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఐని దుశ్శాలువాతో సత్కరించారు. ఆయన వెంట మండల కో–ఆప్షన్ సభ్యుడు షేకు సూర్యనారాయణ తదితరులున్నారు.

గ్రామసభలో ఆమోదించిన పనులు పూర్తి చేయండి

నాతవరం: గ్రామసభలో తీర్మానించిన పనులను వెంటనే పూర్తి చేయాలని నాతవరం సర్పంచ్ గొలగాని రాణి అన్నారు. స్థానిక సచివాలయం వద్ద సర్పంచ్ అధ్యక్షతన మంగళవారం జరిగిన గ్రామసభలో మాట్లాడారు. పంచాయతీలో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై పంచాయతీ కార్యదర్శి కె.శ్రీనివాసరావు వివరించారు. ఉపాధి హామీ, తాగునీరు, పారిశుధ్య పనులపై సభలో చర్చించారు. ఎంపీడీవో హనుమంతరావు, మాజీ ఎంపీపీలు విజయకుమార్, సన్యాసిదేముడు, ఎంపీటీసీ సభ్యులు 1,2, రేణుక, ప్రభావతి, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ మండల శాఖ అధ్యక్షుడు జోగిరాజు, హైస్కూల్ విద్యా కమిటీ మాజీ చైర్మన్ వరహాలబాబు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ

మాకవరపాలెం: మండలంలోని శెట్టిపాలెం, భీమబోయినపాలెం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. సత్యసాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో సమకూర్చిన నోట్ పుస్తకాలను సర్పంచ్‌లు అల్లు రామునాయుడు, రుత్తల నందకిషోర్ అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ ఆర్గనైజర్ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పచ్చదనం, పరిశుభ్రత అవసరం

చీడికాడ: రానున్న మహాత్మగాంధీ జయంతి సందర్భంగా మంగళవారం నుంచి వివిధ సేవా కార్యక్రమాలు ప్రారంభించారు.ఈ మేరకు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాల్లో భాగంగా పలు గ్రామాల్లో మొక్కలు నాటి పరిసరాలు పరిశుభ్రం చేశారు. ఈ మేరకు ప్రతిజ్ఞ చేశారు. అక్టోబర్ 2 వరకు ప్రతి రోజు ఒక సేవా కార్యక్రమం జరుగుతుందని ఈఓపీఆర్‌డీ కామేశ్వరరావు తెలిపారు.

ఎంఈవో–2 పోస్టులు రద్దు చేయొద్దు

నర్సీపట్నం : ఎంఈవో–2 పోస్టులను రద్దు చేసి కాంప్లెక్స్ హెచ్‌ఎంకు అధికారాలు బదలాయించాలన్న ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని పీఆర్టీయూ నర్సీపట్నం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.వరహాలనాయుడు జి.వి.రమేష్‌లు పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయులకు అదనపు బాధ్యతగా మరో బాధ్యతలు అప్పగిస్తే విద్యావ్యవస్థపై సరైన పర్యవేక్షణ ఉండదన్నారు. విద్యా వ్యవస్థ కుంటి పడే అవకాశం ఉందన్నారు. దీనిపై ప్రభుత్వం పునరలోచన చేయాలన్నారు.

స్వచ్ఛతపై అవగాహన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న ఎంపీడీవో హనుమంతరావు ప్రజాప్రతినిధులు

నాతవరం: రోగాలు వ్యాప్తించకుండా ఉండాలంటే ఇళ్లతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో హనుమంతరావు అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం స్వచ్ఛతా హీ కార్యక్రమంలో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. గ్రామాల్లో పారిశుధ్యం పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని, తడి చెత్త పొడి చెత్తసేకరించాలని సూచించారు. ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, మాజీ ఎంపీపీ నేతల విజయ కుమార్, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

అనారోగ్యాన్ని 'నులి'మేద్దాం...

- నులిపురుగులతో రక్తహీనత
- జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం
- చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ



మాడుగుల జెడ్పీ హైస్కూల్లో డీవర్మింగ్ మాత్రలు విద్యార్థులకు అందజేస్తున్న ఎంపీపీ రాజారామ్

మాడుగుల రూరల్ : పిల్లలు, కిశోర బాలలకు కడుపులో నులి పురుగులు ఉన్నట్టయితే పోషకాహార లోపం, రక్తహీనత వల్ల నీరసంగా ఉంటారని కె.జె.పురం పీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఎల్.వి.ఎస్.ఎస్. ప్రసాదు పాత్రుడు పేర్కొన్నారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా, మంగళవారం కె.జె.పురం పీహెచ్‌సీ పరిధిలో గల పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేయించారు. కార్యక్రమంలో భాగంగా, ప్రసాదు పాత్రుడు, మండలంలో 10 సచివాలయాల పరిధిలో 21 పాఠశాలలు, 38 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో గల 7320 మంది 1 నుంచి 19 సంవత్సరాల లోపు పిల్లలకు ఈ మాత్రలు వేయాల్సి ఉండగా, 6,850 మందికి మాత్రలు పంపిణీ చేసినట్టు పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రసాదుపాత్రుడు తెలిపారు. మిగిలిన వారికి ఈ నెల 25న మాత్రలు వేస్తామన్నారు. కింతలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 4433 మందికి మాత్రలు వేసినట్టు వైద్యాధికారి కె.ఎం.నాయుడు తెలిపారు. పీహెచ్‌సీ పరిధిలో 13 సచివాలయాల పరిధిలో గల 38 పాఠశాలలు, 43 అంగన్‌వాడీ కేంద్రం, ఒక కళాశాల పరిధిలో గల విద్యార్థులకు ఈ మాత్రలు వేసినట్టు తెలిపారు.

మాడుగుల : విద్యార్థులు నులిపురుగుల బారిన పడకుండా ప్రభుత్వం అందిస్తున్న డీవర్మింగ్ మాత్రలు తప్పకుండా వేసుకోవాలని ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్ అన్నారు. మంగళవారం స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ డీవర్మింగ్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు డీవర్మింగ్ మాత్రలు వేశారు. పాఠశాలలకు హాజరు కాని విద్యార్థులకు ఇంటికి మాత్రలు అందజేయాలని వైద్యాధికారులను కోరారు. ఇన్‌ఛార్జి ఎంపీడీవో గోపాల్, పాఠశాల హెచ్‌ఎంపాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట : మండలంలో బుచ్చెయ్యపేట, వడ్డాది, తురకలపూడి మూడు ప్రభుత్వ ఆసుపత్రి పరిధిలో ఉన్న పాఠశాలల విద్యార్థులకు ఆయా గ్రామాల వైద్య సిబ్బంది, వైద్యులు నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ చేపట్టారు. మండలంలో 4,100 మంది పిల్లలకు మాత్రలు అందించడానికి ఏర్పాట్లు చేసినట్టు వైద్య సిబ్బంది తెలిపారు.



గొలుగొండలో విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేస్తున్న ఎంపీడీవో, వైద్య సిబ్బంది



తూటిపాలలో విద్యార్థులకు మాత్రలు వేస్తున్న వైద్య సిబ్బంది

కె.కోటపాడు : నులిపురుగుల కారణంగా విద్యార్థులు రక్తహీనత సమస్య బారిన పడకుండా ప్రభుత్వం ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్నట్టు ఎంపీడీవో ఎస్.అప్పలరాజు అన్నారు. కె.కోటపాడు హైస్కూల్లో డీవార్మింగ్ డే సందర్భంగా మంగళవారం విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీవో మాట్లాడుతూ మూడేళ్ల దాటిన ప్రతి విద్యార్థికి వైద్య సిబ్బంది ఆల్బెండజోల్ మాత్రలు ఇవ్వనున్నట్టు తెలిపారు. ఎంఈవో 1,2 సత్యనారాయణ, డీవీడీ ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఆహారం తీసుకునే ముందు చేతులను శుభ్రపరుచుకోవాలన్నారు. కె.కోటపాడు హైస్కూల్లో 230 మంది విద్యార్థులకు మాత్రలు వేశారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ ప్రసాద్, ప్రధానోపాధ్యాయిని పద్మావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాకవరపాలెం: మండలంలో అన్ని పాఠశాలల్లోనూ విద్యార్థులకు వైద్య సిబ్బంది మంగళవారం డీవర్మింగ్ మాత్రలను వేశారు. తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం రాము మాట్లాడుతూ ఈ మాత్రలు వేసుకోవడం వల్ల పిల్ల ఎదుగుదలతోపాటు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు.

చోడవరం రూరల్ : పిల్లల్లో నులి పురుగులను నివారించడం ద్వారా వారి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.కిరణ్‌కుమార్ అన్నారు. మంగళవారం జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా పిల్లలతో ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. విద్యార్థుల ఆరోగ్య రక్షణకు ఈ కార్యక్రమాన్ని జాతీయ సేవా పథకం, ఆరోగ్య శాఖ పెద్ద ఎత్తున నిర్వహిస్తుందని ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ వి.రత్న భారతి అన్నారు. గవరవరం గ్రామంలో జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.జె.సుందర్‌సింగ్ ఆధ్వర్యంలో విద్యార్థులు డీ వర్మింగ్ డే కార్యక్రమంలో పాల్గొన్నారు.

రోలుగుంట : కుసుర్లపూడి జెడ్పీ హైస్కూల్లో మంగళవారం డీవర్మింగ్ డే కార్యక్రమంలో ఎంఈవో–2 జగ్గారావు, హెచ్‌ఎం శెట్టిమోహన్ పాల్గొన్నారు. నులిపురుగులు నివారణపై విద్యార్థులకు వివరించారు. ఎంఎల్‌పీహెచ్ రమాదుర్గ 156 మంది విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు అందజేశారు. ఏఎన్‌ఎం అప్పలనర్స,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గొలుగొండ : విద్యార్థులకు నులి పురుగుల వివారణకు మంగళవారం అన్ని పాఠశాలలో ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. గొలుగొండలో ఎంపీడీవో డేవిడ్‌రాజు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ప్రసాద్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పంపిణీ చేశారు. మాత్రలు సక్రమంగా వాడాలని సూచించారు.



బుచ్చెయ్యపేటలో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ



మాడుగుల పాఠశాలలో మాత్రలు వేయిస్తున్న వైద్యాధికారులు ప్రసాదుపాత్రుడు, లీలాప్రసాద్



డిగ్రీ విద్యార్థులతో మాత్రలు మింగిస్తున్న మాల్యాద్రి

పరిసరాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం

- వాడవాడలా స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం
- విద్యార్థులు, అధికారుల ర్యాలీలు



కె.కోటపాడు : స్వచ్ఛతా ర్యాలీలో పాల్గొన్న తహసీల్దార్ రమేష్‌బాబు, ఎంపీడీవో అప్పలరాజు



కె.జె.పురం సచివాలయంలో పారిశుధ్య కార్మికులకు యూనిఫారం అందజేస్తున్న సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు

కె.కోటపాడు : ప్రతి ఒక్కరూ పరిశుభ్రతా కార్యక్రమాలను నిర్వహించుకోవడం ద్వారా స్వచ్ఛ గ్రామాలను తీర్చిదిద్దేందుకు సహకరించాలని తహసీల్దార్ జె.రమేష్‌బాబు, ఎంపీడీవో ఎస్.అప్పలరాజు అన్నారు. కె.కోటపాడులో స్వచ్ఛతా హీ సేవా పక్షోత్సవాల్లో భాగంగా అధికారులు, విద్యార్థులు కలిసి అవగాహన ర్యాలీని గ్రామంలో నిర్వహించారు. మూడు రోడ్ల కూడలిలో మానవహారంగా ఏర్పడి, పరిసరాల పరిశుభ్రతతో పాటు స్వచ్ఛ గ్రామాల కల్పనకు తీసుకోవాల్సిన అంశాలపై ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ డి.రమేష్, ఏపీఎం వెంకటలక్ష్మి, ఎంఈవో 1,2 సత్యనారాయణ, ప్రసాద్, ఈవోఆర్డీ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి వి.ప్రసాద్, వేచలపు సత్యనారాయణ పాల్గొన్నారు.

రోలుగుంట: మండలంలో పలు గ్రామాల్లో ఈవోపీఆర్డీవో ఎస్.నూకరాజు పర్యవేక్షణలో మంగళవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలను నిర్వహించారు. జె.నాయుడుపాలెం పాఠశాలలో విద్యార్థులతో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతానని, మొక్కలు పెంచి పర్యావరణాన్ని పరిరక్షిస్తానని ప్రతిజ్ఞ చేయించారు. కాలువల్లో దోమల నివారణ మందు స్ప్రేయింగ్ చేయించారు. సర్పంచ్ బగుడు వెంకటరమణ, ఎంఎల్‌హెచ్‌పి పరమేశ్వరి పర్యవేక్షించారు.

మాడుగుల : పరిసరాల పరిశుభ్రత ద్వారా రోగాలను దూరంగా ఉంచవచ్చని ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్ అన్నారు. మంగళవారం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో మాట్లాడారు. పరిసరాల పరిశుభ్రత ఆవశ్యకతను వివరిస్తూ వీధుల్లో ర్యాలీ జరిపి గ్రామస్తులను చైతన్య పరిచారు. ఇన్‌చార్జి ఎంపీడీవో గోపాల్, ఈవోపీఆర్‌డీ మీనాకుమారి, సర్పంచ్ కళావతి పాల్గొన్నారు.

మాడుగుల రూరల్ : స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కె.జె.పురం గ్రామ సర్పంచ్ జామి రమణబాబు, ఎంపీటీసీ సభ్యులు భీశెట్టి శ్రీనివాసరావు పేర్కొన్నారు. మంగళవారం గ్రామంలో సచివాలయ సిబ్బంది, పారిశుధ్య కార్మికులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. పారిశుధ్య కార్మికులకు యూనిఫారమ్‌లు అందజేశారు. సచివాలయం సమీపంలో మొక్కలు నాటారు. పంచాయతీ కార్యదర్శి పెంకి శివ, పంచాయతీ వార్డు సభ్యులు పాల్గొన్నారు.

దేవరాపల్లి : ప్రజలందరీ భాగస్వామ్యంతోనే గ్రామంలో సంపూర్ణ పారిశుధ్యం సాధ్యపడుతుందని దేవరాపల్లి ఎంపీడీవో కె.చంద్రశేఖర్ అన్నారు. గరిశింగిలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని మంగళవారం స్థానిక సర్పంచ్ గూడెపు రాము అధ్యక్షతన నిర్వహించారు. గ్రామస్తులు, విద్యార్థులతో కలిసి పారిశుధ్యంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం పరిశీలించారు. ఎంపీడీవో చంద్రశేఖర్, సర్పంచ్ గూడెపు రాము మొక్కలు నాటారు. స్థానిక పాఠశాలను సందర్శించి విద్యాబోధనతో పాటు మధ్యాహ్న భోజనం అమలును పరిశీలించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలంతా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కోలా వెంకటరమణ(గోపి), ఇంచార్జ్ ఈవోపీఆర్డీ అప్పారావు, పంచాయితీ కార్యదర్శి యశోద, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మాడుగులలో స్వచ్ఛతా హీ సేవా ర్యాలీలో మాట్లాడుతున్న ఎంపీపీ రాజారామ్



జె.నాయుడుపాలెంలో దోమల నివారణ మందు స్ప్రేయింగ్ చేయిస్తున్న పంచాయతీ కార్యదర్శి



గరిశింగి పాఠశాలలో మరుగుదొడ్లను పరిశీలిస్తున్న ఎంపీడీవో చంద్రశేఖర్, సర్పంచ్ రాము

ఘనంగా గణేష్ నిమజ్జనాలు

- భారీగా అన్న సమారాధనలు

దేవరాపల్లి : వినాయక నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకొని అన్నసమారాధనలు, నిమజ్జన మహోత్సవాలతో గ్రామాల్లో ఆధ్యాత్మికత సంతరించుకుందని మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. తారువలో జరిగిన వినాయక నిమజ్జన మహోత్సవంలో ఆయన పాల్గొన్నారు. వినాయకుడిని దర్శించుకొని పూజలు జరిపారు. స్థానిక యూత్ డీజే సౌండ్ సిస్టమ్ నడుమ డ్యాన్స్‌లు వేస్తూ అంగరంగ వైభవంగా నిమజ్జన మహోత్సవాన్ని నిర్వహించారు. రైవాడ పవర్ బాయ్స్ యూత్ ఆధ్వర్యంలో మంగళవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో చల్లా తాతయ్యలు, చల్లా నాయుడు, బుజ్జి, యూత్ సభ్యులు పాల్గొన్నారు. దేవరాపల్లి రాజుల వీధిలో స్టైల్ బాయ్స్ యూత్ ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన జరిగింది. మండల వ్యాప్తంగా పలువురు అన్నసమారాధనలో పాల్గొన్నారు.



రైవాడలో వినాయకుడి వద్ద సందడి చేస్తున్న పవర్ బాయ్స్ యూత్ సభ్యులు



తారువలో వినాయకుడిని దర్శించుకుంటున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

మాడుగుల రూరల్: గణేశ్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా, సోమవారం రాత్రి గ్రామాల్లో గణేశ్ విగ్రహాలను సమీప తాచేరు నదిలో నిమజ్జనం చేశారు. తొమ్మిది రోజుల పాటు పూజలు నిర్వహించి, అన్నసమారాధన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కోలాటం, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలతో స్వామి వారిని నిమజ్జనం చేశారు.

అధికారులు ప్రొటోకాల్ పాటించలేదు

గొలుగొండ : స్థానిక సర్పంచ్‌లు, ఎంపీటీసీ, జెడ్పీటీలకు అధికారులు ప్రొటోకాల్ పాటించకుండా అధికార పక్షంలో నేతలకు గౌరవం ఇవ్వడం పద్ధతి కాదని, జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు అధికారుల తీరుపై ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ మణికుమారి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల వరి విత్తనాలు పంపిణీ వ్యవహారంలో వ్యవసాయ శాఖ సిబ్బంది స్థానిక వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు, సర్పంచ్‌లను పిలువకుండా అధికార టీడీపీ నేతలను పిలిచి విత్తనాలు పంపిణీ చేయడం తగదని సభ దృష్టికి తీసుకొచ్చారు. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ సుభీషణ మాట్లాడుతూ తాగునీటి సమస్యలు లేకుండా అన్ని గ్రామాల్లో చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. డ్వాక్రా సంఘాలకు ప్రభుత్వం నుంచి వచ్చి ప్రతి రాయితీని పంపిణీ చేస్తున్నట్టు ఏపీఎం మంగ తెలిపారు. ఎంపీడీవో డేవిడ్‌రాజు, వైస్ ఎంపీపీ సుర్ల బాబ్జి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ మణికుమారి

ఘనంగా విశ్వకర్మ జయంతి



మాకవరపాలెంలో పూజలు చేస్తున్న భక్తులు

మాకవరపాలెం : విశ్వకర్మ జయంతిని మండలంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంతో పాటు జీకోడూరులో ప్రత్యేక మండపం ఏర్పాటు చేసి పూజలు చేశారు. జీకోడూరులో మూడు రోజులపాటు పూజలు నిర్వహించి విశ్వకర్మ విశ్వకర్మ విగ్రహాన్ని నిమజ్జనం చేస్తామని సంఘ అధ్యక్ష, కార్యదర్శులు కర్రి సూర్యనారాయణరావు, కోడూరు వెంటరమణ తెలిపారు. మాకవరపాలెం విశ్వబ్రాహ్మణ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు ఆదినారాయణ, అరిపాక శ్రీను, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మెరిట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు

బుచ్చెయ్యపేట : మండలంలో గల గున్నెంపూడి జిల్లా పరిషత్ హైస్కూల్ మెరిట్ విద్యార్థులకు జెడ్పీటీసీ దొండా రాంబాబు ప్రోత్సాహక నగదు అందించారు. తన తండ్రి గోదారయ్య జ్ఞాపకార్థం ఈ ఏడాది పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన యువతేజశ్విని, యువశ్రీకి రూ.2 వేలు చొప్పున, సుంకరి మౌనిక, ముచ్చకర్ల వెంకటేష్‌లకి వెయ్యి రూపాయల చొప్పున నగదు, ప్రశంసా పత్రం అందించారు. మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పేదల పిల్లలు ఇంజినీర్లు, డాక్టర్లు అవ్వాలని కోట్లాది రూపాయలతో నాడు నేడు పనులు చేపట్టి పాఠశాలలు రూపురేఖలు మార్చారని, ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలు అధిరోహించి మీ తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని జెడ్పీటీసీ రాంబాబు విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు హరిణి అప్పారావు, గోపిశెట్టి శ్రీను, ఎంపీటీసీ వెంకట రమణ, మాజీ సర్పంచ్ కాసులమ్మ, హెచ్‌ఎం కేవీ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



గున్నెంపూడిలో విద్యార్థులకు ప్రోత్సాహక నగదు అందిస్తున్న రాంబాబు

ఘనంగా హిందీ భాషా దినోత్సవం

దేవరాపల్లి : దేవరాపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హిందీ భాషా దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బి.రాధ మాట్లాడుతూ హిందీ భాష ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా హిందీ అధ్యాపకురాలు డా.ఎస్.నిర్మల, 2024 మార్చిలో జరిగిన పరీక్షల్లో హిందీ సబ్జెక్టులో అత్యధిక మార్కులు సాధించిన 12 మంది విద్యార్థులకు బహుమతులను అందజేశారు.



దేవరాపల్లి ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులకు బహుమతులను అందజేసిన ప్రిన్సిపాల్ రాధ

మోదీ పుట్టినరోజు సందర్భంగా సేవా కార్యక్రమాలు



కె.కోటపాడు ఆస్పత్రిలో రోగులకు పాలు, పండ్లు, రొట్టెలను అందిస్తున్న సత్యనారాయణమూర్తి



మాడుగులలో రోగులకు పాలు, రొట్టెలు అందజేస్తున్న ఎమ్మెల్యే బండారు, తదితరులు

కె.కోటపాడు : దేశ ప్రధాని మోదీ జన్మదిన వేడుకలను కె.కోటపాడులో బీజేపీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం ఘనంగా జరిపారు. స్థానిక గౌరీ కల్యాణ మండపంలో జన్మదిన కేక్‌ను కట్ చేసిన అనంతరం కె.కోటపాడు సీహెచ్‌సీలో రోగులకు పాలు, పండ్లు, రొట్టెల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కోటాన ఈశ్వరరావు, మాజీ డీసీసీబీ డైరెక్టర్ చల్లా సత్యనారాయణమూర్తి, పైలా అమ్మాజి, గంగునాయుడు, దాలినాయుడు, శరగడం నాయుడు పాల్గొన్నారు.

నాతవరం: మండల కేంద్రంలో మంగళవారం ప్రధాని నరేంద్రమోదీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. బీజేపీ పార్టీ జిల్లా నాయుకులు యర్ర సూర్యనారాయణ పేరూరి బుల్లిదొర, రాయుడు, లక్కోజు విక్రమ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేసారు. నాతవరం పీహెచ్‌సీలో రోగులకు పండ్లు, పాలు, రొట్టెలు పంపిణీ చేశారు.

మాడుగుల: మాడుగులలో ప్రధాని మోదీ జన్మదిన కార్యక్రమాలు మంగళవారం సాయంకాలం నిర్వహించారు. ప్రభుత్వాసుపత్రిలో పాలు, రొట్టెలు రోగులకు ఉచితంగా అందజేసారు. అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ పాల్గొన్నారు. నూతనంగా నిర్మాణం జరుగుతున్న ఆసుపత్రిని పరిశీలించి త్వరిత గతిన పూర్తి చేయిస్తామన్నారు. స్థానిక ఏపీయుడబ్ల్యూజే, ప్రెస్‌క్లబ్ భవనం మరమ్మతులకు రూ.5 లక్షలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి, పుట్టాగంగయ్య తదితరులు పాల్గొన్నారు.

రోలుగుంట : మండలంలో పలు గ్రామాల్లో మంగళవారం ప్రధాని నరేంద్రమోదీ జన్మదిన వేడుకలను బీజేపీ నాయకులు ఘనంగా జరిపారు. బుచ్చింపేటలో ఆ పార్టీ మండలశాఖ అధ్యక్షుడు కర్రి తమ్మునాయుడు కార్యకర్తలతో కలసి పేదలకు రొట్టెలు, పాలు పంచారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ పేదలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలని కోరారు. ఆసక్తి గల వారు పార్టీ సభ్యత్వం కార్యక్రమంలో పాల్గొని తమ వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమాలను తమనారపాలెంలో తమరాన పెదిరెడ్డి వెంకటరమణ, కుసుర్లపూడిలో పచ్చిగోల్ల ఈశ్వర్రావు, రోలుగుంటలో ఆడారి గణేష్, మద్దు నారాయణరావు నిర్వహించారు.

చికెన్ వ్యర్థాలతో దర్జాగా చేపల పెంపకం

దేవరాపల్లి: గ్రామాలలో చేపల చెరువుల నిర్వాహకులు దర్జాగా చికెన్, పశు మాంస వ్యర్థాలను మేతగా వేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.వెంకన్న ఆగ్రహం వ్యక్తం చేశారు. దేవరాపల్లిలో మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఈ మేరకు నిర్వాహకులకు మత్స్యశాఖ అధికారులు నోటీస్‌లు అందజేశారన్నారు. అయితే వారం రోజులు గడవక ముందే వారి ఆదేశాలను బేఖాతరు చేస్తూ మరలా యథేచ్ఛగా చికెన్, పశు మాంస వ్యర్థాలను మేతగా వేస్తున్నారని ఆరోపించారు. అధికారులు స్పందించి చేపల చెరువుల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పరిశ్రమల్లో కార్మికుల భద్రతకు సీపీఎం రక్షణ యాత్ర



కార్మికులతో కలిసి గోడపత్రికను ఆవిష్కరిస్తున్న ముత్యాలనాయుడు

కె.కోటపాడు : ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో ఫ్యాక్టరీలను తనిఖీ చేయకుండా అధికారులపై ఆంక్షలు విధించడం వల్ల పరిశ్రమల్లో ప్రమాదాలు జరుగుతున్నట్లు సీపీఎం పార్టీ మండల కార్యదర్శి రొంగలి ముత్యాలనాయుడు అన్నారు. ఫార్మా, సెజ్‌లలో కార్మికుల భద్రతకు సీపీఎం నిర్వహిస్తున్న రక్షణ యాత్ర గోడపత్రికలను ఆనందపురంలో కార్మికులతో కలిసి ముత్యాలనాయుడు మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంపెనీలలో తనిఖీలు లేకపోవడం కారణంగా ఇటీవల కాలంలో 120కు పైగా ప్రమాదాలు జరిగాయన్నారు. అనకాపల్లి జిల్లాలో జరిగిన ప్రమాదాల్లో సుమారు 62 మంది చనిపోయారని అన్నారు. జీవో నంబర్ 62ను తీసుకువచ్చి కంపెనీలలో తనిఖీలు లేకుండా చేసారని, జీవోను రద్దు చేసి కార్మికులకు భద్రతను కల్పించడం కోసమే సీపీఎం రక్షణ యాత్ర చేస్తుందని అన్నారు. ఈ యాత్రను విజయవంతం చేయాలని ఆయన కోరారు. సీపీఎం నాయకులు ఈర్లె నాయుడుబాబు, యర్రా దేముడు పాల్గొన్నారు.